

# కష్టఫలితం

ఫ్యాక్టరీ బయ్యిమంటూ కూతకూసింది. గోపయ్య అమ్మయ్య..... అమ్మయ్య అనుకుంటూ చేతిలో పిడి వదిలేసి వెనక స్తంభంమీదకు వాలాడు. ఉదయం నుండి పడుతున్న శ్రమకి ఆ రోజుకి అంతిమగీతం పాడేసి ఆగిపోయిన ఫ్యాక్టరీ గొట్టంలోనుంచి మగతగా పొగ బయటకు వస్తోంది. గోపయ్య కళ్లముందర అతివేగంగా తిరుగుతున్న యినుపచక్రం బర్రుబర్రుమంటూ కొంచెంగా మూలిగి మెల్లిగా ఆగిపోయింది. నడుముకు చుట్టిన గోతాము విప్పి చక్రంమీద పడేసి ఒకసారి లేచి ఆవలించాడు. నడుమంతా పటపటమంటూ శబ్దంచేసింది. మేకుకి తగిలించిన తలపాగా చేతిలోకి తీసుకుని మీదపడ్డ తవుడూ చిట్టూ అంతా గట్టిగా దులిపేసి ముఖానికి అంటిపెట్టుకున్న స్వేదబిందువుల్ని నిర్దాక్షిణ్యంగా నలిచేశాడు. గుడ్డకు వదలని తవుడు ముఖమంతా అంటుకుని వికారంగా కనబడుతోంది.

కాళ్ళు తడబడుతుంటే తూలుపాటు వచ్చి కొంచెంలో పడిపోయేవాడేగాని ఎదురుగా ఆగిపోయిన యినపచక్రాన్ని బలంగా పట్టుకొని నిలబడగలిగాడు. అతని బలానికి ఆ చక్రం ఒక్క బెత్తెడైనా అటూ యిటూ కదలలేదు. తన ప్రయత్నం లేకుండా కళ్ళకు అందనివేగంతో తిరిగిన చక్రం తను ప్రయత్నం చేసినా కదలకపోయేటప్పటికి రోజు మాదిరి ఆశ్చర్యం కలిగింది. ఒకసారి ఎగాదిగా చూచాడు. ఎదురుగావున్న కిటికీలోనుంచి పొగగొట్టం పొగను వదలలేక

వదలలేక బాధపడుతూ కనపడింది. ఫ్యాక్టరీ శ్రేయస్సుకోసం కష్టించే తనకీ గొట్టానికి ఏమంత వ్యత్యాసం లేదనుకున్నాడు గోపయ్య.

'కదలవేంరా!' అంటూ కిందనుంచి యజమాని పెట్టిన గావుకేక అతని కర్ణపుటాల్లోనుంచి దూసుకునిపోయి హృదయానికి సూటిగా తాకింది. అతని హృదయం ఎప్పుడూ తలలోనే వుంటుంది. వులిక్కిపడి తలపాగా మళ్ళీ దులిపి యినపచక్రాన్ని రెండుసార్లు తట్టి 'మళ్ళీ వస్తాలే' అన్నట్టు చూస్తూ మెట్లవైపు తిరిగాడు. యినపమెట్లను చూస్తుంటే తను నిలువుటద్దంలో అస్థిపంజరం మాదిరిగా కనపడ్డట్లు వుంది. పక్కకడ్డీలు రెండూ చేతుల్తో పట్టుకుని మెల్లగా అడుగులో అడుగేసుకుంటూ కిందకి దిగాడు.

మెట్లకిందుగా ఫ్యాక్టరీ ఆడిన బియ్యం రాసి అయింది. మెట్లు ఎక్కేటప్పుడు ఒక్కగింజ ఉండదు. ఆ స్థలంలో తనూ, పొగగొట్టం కలిసి శ్రమించిన ఫలితంగా పొద్దుకూకేటప్పటికి అంత రాసి తయారవుతుంది. తలపాగ మళ్ళీ ఒక్కసారి విప్పతీసి వళ్ళంతా తుడుచుకుని జుట్టును చేత్తోనే దులుపుకున్నాడు. కొంత తవుడు, బలవంతం చేసినా, ఒకనాటి స్నేహితాన్ని యింతలో మరువలేనన్నట్లు అతని జుట్టును అంటిపెట్టుకునేవుంది. బియ్యాన్ని కొంచెంగా చేతిలోకి తీసికుని ఎగరవేస్తూ 'యియ్యాల బియ్యం సాలా బాగున్నాయి దొరా' అన్నాడు. యజమాని చీదరించుకుని 'ఊ' అన్నాడు. గోపయ్య చేతిలో గింజలు యింకా ఎగురుతూనే వున్నాయి. ఒకటి రెండు నోటిలోకి కూడా వాటంతట అవే ఎగిరినాయి. యజమాని వందరూపాయల నోట్లు మూడు మడిచి చొక్కా జేబులో దోపి అటూ యిటూ చూశాడు తను చేసేది దొంగపని అన్నట్లు. గోపయ్య చేతితో బియ్యపురాసిని యింకా కదలిస్తూనే 'యియ్యాల్టికి బియ్యం కొలిపించండి దొరా...పైసలొద్దులేండి' అన్నాడు. అక్కడిచ్చే పైసలు పెడితే బయట ఒక్కపూటకి సరిపోయే బియ్యంగూడా రావు. అందులో రాళ్ళూ, రప్పలు. యిక్కడే·అయితే ఎక్కువయినా తక్కువయినా మంచిబియ్యం....గంజి కమ్మగా వుంటుంది. గోపయ్య కిందటివారం బియ్యం తీసుకెళ్ళిన రోజు బాగా గుర్తుంది. అందుకనే అటువంటి గంజిమీద మళ్ళీ వ్యామోహం కలిగింది. యజమాని మాటలాడకపోవడం చూసి ఏమయ్యా.... నన్ను పంపించరూ....' అన్నాడు.

'పోరా.... వెధవ సొదా నువ్వూను...యివ్వాళ బియ్యం కొలవటానికి వీల్లేదు...' అన్నాడు యజమాని జేబులో చెయ్యిపెట్టి నోట్లకోసం తడిమిచూస్తూ.

'రోజూ అడుగుతున్నానా యేంటిదొరా.... అట్లా అగ్గవుతారు' గోపయ్య మాట యజమాని వినిపించుకోలేదు.

'ఎదురుగ్గా డబ్బిచ్చిన పెద్దమనిషికి బియ్యం కొలవాలంటావా లేదా.... మొద్దు గాడిదకొడుకులకి బియ్యం కావాల్సివచ్చినాయి బియ్యం....'. యజమాని వచ్చిన పెద్దమనిషి వంక తిరిగి 'చూడండి ఈ లేబరు వెధవలతో....బజారుకు పోయి నూకలేడవరాదూ! వచ్చే మూడు పైసలకి.... వెధవ దర్జా వీడూను... చెపితే తెలుసుకోలేరండీ' అన్నాడు. ఆ పెద్దమనిషి కొద్దిగా యికిలించి గోపయ్యవంక చూచి నవ్వబోయి ఆగిపోయాడు. గోపయ్య కళ్ళు రెండూ అగ్నిజ్వాలల్లాగా మండిపోతున్నాయి. అది ఆగ్రహంవలన కాదు. కంటిపోషణకు తగిన ఆహారం అందులో జొరబడక ఉడికిపోతున్నాయి. యజమాని నవ్వుముఖం పెట్టి 'పోరా...గోపయ్యా! పైసలెందుకు పాడుచేసుకుంటావుగాని...' అన్నాడు. వచ్చిన పెద్దమనిషి యజమానివంక

సానుభూతిగా చూశాడు. గోపయ్య తవుడుతో తడి యింకిపోయిన పెదిమలను బలవంతానా కలిపి 'యింత కష్టం చేస్తున్నాంగా.... బియ్యానికి సరిపోయే పైసలే యివ్వరాదూ' అంటూ గొణిగాడు. యజమానికి వినబడలేదు. పెద్దమనిషికి వినబడ్డా మింగి వూరుకున్నాడు.

గోపయ్య గుప్పిటినిండా బియ్యం పోసుకుని అక్కడినుంచి వాటివంక చూస్తూ బయలుదేరాడు. యజమాని ఆ బియ్యాన్ని రాసిలో పొయ్యమని అందామని నోరు తెరవగానే గోపయ్య అది గమనించి వాటిని నోటిలో పోసుకుని నవ్వుకుంటూ గబగబా అడుగులు వేశాడు. యజమాని విరగబడినవ్వి 'ఈ అలగామూక యింతేనండి....కాస్త విషయాల్లో గూడా నీచానికి వడిగడతారు. ఆ కాసిని బియ్యం పాపిష్టి సొమ్ముతింటేనే గాని వాడికి తృప్తితీరదు....' అన్నాడు. యిందాకటినుంచి నవ్వుదామనుకుని వూరుకున్న పెద్దమనిషి గోపయ్య నాలుగడుగుల దూరం పోగానే ఒక్కసారిగా నవ్వాడు. పుక్కిట బియ్యం చిందరవందరగా పడిపోయాయి. ఇంకా బిగ్గరగా నవ్వుతూ బియ్యంవంక వేలుపెట్టి చూపించాడు. 'యివిగో నీ బియ్యం నువ్వే తీసుకోలే' అన్నట్టు. యజమాని వుక్రోషపడి లేవబోయి పొట్టబరువుకు నిలవలేక పెద్దమనిషిని పట్టుకుని మళ్ళీ కూర్చున్నాడు. గోపయ్య వెనకకు తిరిగి చూడకుండా రోడ్డుమీదదాకా పారిపోయి 'ఇహిహీ' అంటూ బిగ్గరగా నవ్వాడు.

అడుగులు తడబడుతున్నా యింటిదాకా పోక తప్పేటట్లు లేదు. ఎదురుగా అరుగుమీద కూర్చున్న గుమాస్తా యితని ఒక్కనికీ పైసలివ్వటం కోసమే ఆగినట్టున్నాడు. అప్పటికే మిగతా కూలీలంతా ఒక్కొక్కరే జారుకుంటున్నారు డబ్బుల లెక్క సరిచూసుకుంటూ. లేని సత్తువ తెచ్చుకుని అరుగుదాకా పోయి గుమాస్తా పక్క కూలపడ్డాడు. పొద్దున తాగినగంజి కడుపులోనుంచి కిందకు పోతూ 'కడుపు పూర్తిగా కాళీ అయిందయ్యా' అన్నట్టు అరిచింది. గుమాస్తా చిల్లర డబ్బులు చేతిలో పెడుతూ 'త్రేనుస్తున్నాడు దొంగవెధవ... ఫ్యాక్టరీలో పడి తిన్న బియ్యం అన్నీ ఏమవుతాయి' అన్నాడు. గోపయ్య అతన్ని చాచి కొడదామనుకున్నాడు. ఆ సమయంలో కనక కలియపడితే తన వోటమి తప్పదని తెలియటం వలన మెదలకుండా డబ్బులు రొండిలో దోపుకుని వూరుకున్నాడు. గుమాస్తా అరుగుదిగి తను కూర్చున్న వుత్తరీయాన్ని దులిపి మీదవేసుకుని ఫ్యాక్టరీలోకి చొరబడ్డాడు. గోపయ్య యింటికి బయలుదేరటానికి అరుగుమీదనుండి నేలమీదకి జారి నిలబడేటప్పటికి ఒక్కసారి దీపాలు వెలిగాయి. 'శ్రీ అన్నపూర్ణా ఫ్యాక్టరీ' అన్న అక్షరాలు సిగ్గుతో కుంచించుకుపోయి ఫ్యాక్టరీ ఎదుట బోర్డుమీదనుంచి వదిలిపోవటానికి ప్రయత్నం చేస్తున్నట్లు కనపడ్డాయి. అక్షరజ్ఞానం లేకపోయినా ఫ్యాక్టరీ పేరు అనేకసార్లు వినివుండటంవలన 'శ్రీ అన్నపూర్ణా' అంటూ అరుస్తూ గోపయ్య అడుగులు వేశాడు యింటివైపుకి.

తారు రోడ్డుకి రెండు పక్కలా వెలుగుతున్న విద్యుద్దీపాలు రోడ్డు మీద మెరుస్తున్నాయి. గోపయ్య యివన్నీ తనకోసమేనన్నట్లుగా వాటివంకచూచి నిట్టూర్చాడు. అడుగులు చకచకా సాగుతున్నకొద్దీ 'తనవి' అనుకున్న దీపాలన్నీ ఒక్కొక్కటే తనని విడిచిపెట్టి వెనక్కుపోతున్నా ఆకాశంలో అర్ధచంద్రాకారంలో వెలుగుతున్న చందమామ మటుకు అతన్ని అంటిపెట్టుకుని వస్తున్నది. తనకు శాశ్వతమైన స్నేహాన్ని చూపించేది చందమామేగాని మనుషులు వేసిన దీపపు స్తంభాలు కాదనుకున్నాడు. చందమామను దృష్టిలో వుంచుకుని తారురోడ్డుమీద యింకా నాలుగడుగులు వేసేవాడేగాని తన గుడిసెవుండే సందురాగానే అలవాటు చొప్పున అతని

కాళ్లు వాటంతట అవే మలుపుతిరిగినాయి. బుద్రలేనిజ్ఞానం కాళ్ళకున్నట్లనిపించింది. అందుకనే అయివుంటుంది తను వద్దనుకున్నా కాళ్ళు రోజూ బలవంతంగా యింటికి తీసుకుని పోతూనే వుంటాయి.

అంతదూరం నడిచినా ఒక్క గతుకయినా తగలని తారు రోడ్డు వదలగానే మురుగుకాలవ ఎదురయింది. పగటిపూట సరిగా కనపడ్డా రాత్రిపూట చందమామ గుడ్డివెలుగులో అంతంత మాత్రంగానే కనిపిస్తోంది. 'దాని దుంపతెగ దూకలేనా' అనుకుంటూ గోపయ్య దాని మీదుగా వురికాడు. ఒక జానెడు దూరంలో తప్పిపోయింది. కుడికాలు బురద నీటిలోపడి మురుగు గబుక్కున పైకి చిందింది. తవుడుతో తెల్లబడిన పంచెమీద అద్దకం వేయించినట్లు అన్నీ నక్షత్రం గుర్తులు పడిపోయినాయి. చేతితో తుడిచివేద్దామనుకున్నాడు గాని యింకా అసహ్యంగా తయారవుతుందని ఊరుకున్నాడు. వాటివంకనే వెనక్కి చూస్తూ ముందుకు అడుగులు సాగించాడు. రెండుమూడు దెబ్బలు తగిలిన తర్వాతగాని గుడిసె దర్శనం కాలేదు.

గుడిసె తన దృష్టిలోకి వచ్చిన తక్షణమే దానిలోనుండి వస్తున్న పిల్ల ఏడుపు చెవులకు గింగురుమంటూ వినిపించింది. 'కూడు పెట్టకుండా ఎన్ని బాదుతేమటుకు అదేం విని చస్తుంది' అనుకున్నాడు. అడుగు ఆగిపోయింది. యింటిలోకి పోవటానికి ఎందుకనో మనస్కరించలేదు. 'తా దూర సందులేదు మెడకో డోలు....తిండికి చాలక ఒక మూల చస్తూ వీడు పెళ్ళిగూడా చేసుకున్నాడు' - యజమాని కిందటివారం బియ్యం అడిగినప్పుడు అన్నమాటలు స్ఫురణకు వచ్చినాయి. నిజమేననిపించింది. ఎందుకీ తాపత్రయం? కూడు పెట్టలేనివాడు తాళిగట్టటం ఘోరమైన తప్పిదం అనిపించింది. గోపయ్య జుట్టును వేళ్ళమధ్యలోనుంచి పోనిచ్చి పైకి ఎగదువ్వుకున్నాడు. 'తాళిగట్టాడో అని ఏడవకబోతే తిండిగ్గూడా నరిపోయేట్లు కాలిగింజలియ్యరాదూ నా కొడుకులు' అనుకున్నాడు. వూహా మాత్రంగా పిల్ల ఏడుపు నిశ్శబ్దమైన వాతావరణాన్ని చీల్చుకుంటూ వస్తోంది. అది అతని హృదయాన్ని చీల్చివేస్తోంది. చేతిలో డబ్బులు పెడితే ఈ పూటకి మరునాటికి సరిపోయే నూకలు వస్తాయని గోపయ్యకు తెలుసు. అతని మనస్సు ఎక్కడో విహరిస్తోంది. అతని ఆలోచనలు ఎక్కడో తేలిపోతున్నాయి. 'ఈ ఏడుపు ఎప్పుడూ ఉండేదేనెహో....యియ్యాల్టికి ఒక్కముంత తాగివస్తే రేపటాల సంగతి మళ్ళీ చూద్దాం' అనుకున్నాడు. అతని ఆలోచన అతనికంటే అతని కాళ్ళకు ముందరగా తెలిసింది. అవి వెనక్కి తిరిగి రోడ్డువైపుకు బయలుదేరినాయి. పిల్ల ఏడుపు యింకా బిగ్గరగా వినిపిస్తూనేవుంది.

గోపయ్యకు ఆ వుత్సాహం ఎక్కడినుండి వచ్చిందో అతనికి తెలియదు. యించుమించు పరుగెత్తుతున్నాడు. అతని వూహలతోపాటు పిల్ల ఏడుపు లీలగా వినపడుతూ ఆగిపోయింది. తుపాను ఆగిపోయిన తర్వాత కలిగే భయంకరమైన నిశ్శబ్దం అతని హృదయం చుట్టూ పెనవేసుకుపోయింది. ఆ బంధాలను విడమరిచి స్వేచ్ఛ పొందుదామని వ్యర్థప్రయత్నం చేస్తూ యింకా పరుగెత్తుతూనే వున్నాడు. గోపయ్య గమ్యస్థానం చేరగానే కాళ్లు వాటంతట అవే ఆగిపోయినాయి.

పులిసిపోయిన కల్లువాసన భరింపరానిదిగా ఆ ప్రదేశమంతా అలుముకుంది. గోపయ్య దాటివచ్చిన గోడ కెదురుగా చిన్న పందిరి లాగా వేసివుంది. నాలుగు వాసాలమీద నిలబడ్డ మంచెకు పైన అచ్ఛాదనగా చిల్లుల తడికె ఒకటి మంచెవాసాల నాధారం చేసుకుని నిరామయంగా

వూగుతోంది. నాలుగు బానల వెనకగా ఎర్రగుడ్లవ్యక్తి ఒకడు చిరిగిపోయిన తుండుగుడ్డను గాలిలోకి వూపుతూ వెకిలిగా అరుస్తున్నాడు. కుండలమీద వున్న ముంతలు పక్కకు ఒరిగి మూకుడుకు కరుచుకుని వున్నాయి. మంచె కిందుగా అయిదారు బానలు చిందరవందరగా పడివున్నాయి. ఖాళీ అయిపోయిన తర్వాత పట్టిన దుర్గతిలాగా కనపడుతుంది. మంచెవాసాలకానుకుని చేరిగిలబడ్డ వాళ్ళిద్దరు మగతగా వులిక్కిపడుతూ మెలకువవచ్చినప్పుడల్లా రెండు పిచ్చికేకలు వేసి వూరుకుంటున్నారు. ఒకతని చేతిలో ముంత నెత్తిమీద కిక్కి కూర్చుంది. ఆ ముంత పడిపోకుండా అతడు గంతులువేస్తూ లొల్లాయి పదాలు పాడుతున్నాడు.

గోపయ్య ఆ వాతావరణంలో అడుగుపెడుతూనే స్వేచ్ఛావాయువును మనసారా పీల్చాడు. ఆలాపనగా పిల్ల ఏడుపు హృదిలో కలచివేస్తోంది. అతని భార్యముఖం గూడా లీలగా గుర్తుకు వచ్చి వెంటనే మాసిపోయింది. దీని తర్వాతనే పెళ్లామయినా బిడ్డలయినా అనుకున్నాడు. భుజాన వున్న తలపాగాను నడుముకు చుట్టి రొండిలో వున్న మూటను ఒకసారి చేత్తోనే నొక్కిచూచాడు. డబ్బులకుప్ప భద్రంగా పెట్టినట్లే వుంది. బానల వెనక మనిషి కుండమీద వూది ముంతలోకి కుండలోని కల్లును కొద్దిగా వంచాడు.

'ఏటిరా గోపయ్యా! మామీద బొత్తిగా దయతప్పినట్లుంది...ఈడకి రావటమే మానేశావే' అన్నాడు. అక్కడికి రాకపోవటం పెద్ద అన్యాయంగా కనపడ్డది. గోపయ్య సమాధానం చెప్పకుండానే రొండిలోనుంచి అణాబిళ్ల తీసి పైకి గిరగిరా తిరిగేటట్లు ఎగరవేసి ఆ చేత్తోనే కిందకు పడకుండా పట్టుకున్నాడు. గుప్పిటి తెరిచి చూస్తే బొమ్మ కనపడింది. హాయిగా నవ్వుతూ 'నీ అదృష్టం పండిందిలే కొండిగా' అంటూ ఆ అణా బిళ్ళను బానల వెనక మనిషి చేతిలో పడేశాడు.

ముంత చేతిలో పట్టుకుని, దాటివచ్చిన గోడదాకా పోయి ఎత్తు కొండరాయి ఒకటి వుంటే దానిమీద కూర్చున్నాడు. కట్టిన పంచను మోకాళ్ళ పైకి ఎగతీసి గొంతుక కూర్చున్నాడు. రెండు చేతులతో ముంతను సరిగ్గా పట్టుకుని వరుసగా పేర్చబడ్డ బానలవంక చూచాడు. ముంత పెదిమలకు తగలగానే ఆ బానల్లో వున్న కల్లంతా తన కడుపులోకి పోయినట్లయింది. ముంత పైకెత్తి గడగడా తాగేసి వెర్రిగా ఆకాశం వంక చూచాడు. దూరాన నక్షత్రం ఒకటి రాలి దారిలోనే అంతర్ధానమయింది. అదృశ్యమయిన నక్షత్రం వంక చూస్తూ ఒక్క ఎగురు ఎగిరాడు. కాళ్ళల్లోకి సత్తువ యిప్పుడిప్పుడే వస్తోంది. 'దాని దుంపతెగ ఎంత గంజి తాగితే మటుకు ఈ మజా ఎక్కడొస్తుంది' అనుకున్నాడు. చేతిలో ముంత అతని స్వాధీనం తప్పి గాలిలో నాట్యం చెయ్యటం ప్రారంభించింది. దాన్ని గట్టిగా నేలకేసి కొట్టేశాడు ఆఖరికి. గబగబా మంచె దగ్గరికి పోయి 'అరె కొండిగా యింకో ముంత యియ్యరా అంటూ తూలిపడబోయి కల్లుబాన బట్టుకు నిలబడ్డాడు. రొండిలోనుంచి రెండణాలు తీసియిచ్చాడు. ముంత ఈసారి బాగా నిండింది. గోపయ్య గబగబా ఒక్క దమ్ములో ముంత ఖాళీచేసి గాలిలో కెగరే ాడు.

కళ్లు ఎరుపు యింకా ఎక్కువ అయే అవకాశం లేక జ్యోతిలాగా వెలిగిపోతోంది. ఒకసారి రొమ్ముమీదా, తొడలమీదా చెయ్యివేసి కొట్టుకుని మీసాలు మెలిపెట్టాడు. రొండిలోనుంచి చిల్లరంతా తీసి బానపక్కన పెట్టి ఆ డబ్బు కెంతవస్తుందో అంతా యిచ్చెయ్యమన్నాడు దుకాణంవాడివైపుకి తిరిగి. మూలనున్న పెద్ద ముంత ఒకటి బానపక్కకు వచ్చి నిలబడింది.

పెద్దబాన పక్కకు ఒరిగి దానిని నింపేసింది. గోపయ్య విరగబడి నవ్వుతూ దాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని గంతులేస్తూ నడవటం మొదలుపెట్టాడు.

అతని కళ్ళకు మనుషుల రూపం వివరం తెలియకపోయినా నీడల్లాగా కనపడుతున్నారు. మంచె తాడిచెట్టులాగా కనపడుతోంది. అందులో అతని పెళ్లాం పిల్లలు కూర్చున్నట్లు అనిపించింది. భయపడ్డవాడిలాగా ముంతపట్టుకుని తను దాటివచ్చిన గోడవైపుకు వచ్చాడు పారిపోదామని. తన ఫ్యాక్టరీ యజమాని అక్కడ ఎదురుపడకపోతే పారిపోయేవాడే.

యజమాని సాక్షాత్కారం అతనికి ఈ లోకపు దృష్టిని ప్రసాదించింది. యజమాని పక్కన పెద్దమనిషి గూడా వున్నాడు. అతని నోటిలో నుంచి గాలిలోకి చాలాదూరం వచ్చిన చుట్టచివర నిప్పు కణకణలాడుతున్నది. గుప్పుమంటూ వస్తున్న పొగను చూసేటప్పటికి తనకు ప్రాణస్నేహితమైన పొగగొట్టం జ్ఞప్తికి వచ్చింది. గోపయ్య తడబడి వణుకుతూ కల్లుముంత వీపువెనక దాచుకొని వెనక్కు రెండడుగులు వేశాడు. యజమాని వికటంగా నవ్వుతూ 'ఇంతేనండి తాగితందనాలాడతాడు....యిక్కడ గూడా తాగగూడదని రూలు పెట్టిస్తే సరి...అప్పటికిగాని బాగుపడరు' అన్నాడు. పెద్దమనిషి చీకటిలో నవ్వాడుగాని శబ్దం కలగకపోవటం వలన చుట్ట కదలికను తప్ప ఏమీ గమనించలేకపోయాడు గోపయ్య. గబగబా వెనక్కు మంచెదగ్గరకు వెళ్ళి ముంత ఎత్తుకుని గబగబా తాగేశాడు. 'ఈ నా కొడుకులు నాకీ సుఖం గూడా లేకుండా చేద్దామనుకుంటున్నారు.... రూలు పెడతారట రూలు' అంటూ తూగుతూ ఆనందంలోకి ఒరిగిపోయాడు.